సాక్షి
తిరుపతి
బుధవారం । 30 । అక్టోబర్ । 2024



పవిత్రాల సమర్పణ

శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు వైభవంగా సాగాయి. - 8లో



భరద్వాజ తీర్థంలో అశ్లీల నృత్యాలు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలో యూట్యూబర్లు అశ్లీల నృత్యాలు కలకలం రేపాయి. - 8లో



సమీరా వచ్చేస్తున్నా!

సమీరా వచ్చేస్తున్నా.. అంటూ చెప్పిన భర్త తెల్లవారేసరికి విగతజీవిగా కనిపించడం ఆమెను దుఃఖసాగరంలో ముంచేసింది. - 8లో

న్యూస్‌రీల్

రేపు స్విమ్స్ ఓపీ, ఏటీలకు సెలవు

తిరుపతి తుడా: దీపావళి పండుగ సందర్భంగా గురువారం స్విమ్స్ ఆస్పత్రి ఓపీ, ఓటీలకు సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. స్విమ్స్ అత్యవసర విభాగం (క్యాజువాలిటీ) సేవలు యథాతథంగా కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

వచ్చే నెలలో డీఎస్సీ



మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి అర్బన్: వచ్చే నెలలో 16,347 టీచర్ ఉద్యోగాల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం మంత్రి నేతృత్వంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజన్ 2047కు ఏపీని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా మార్పు చేస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణా నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మాజీ ఎమ్మెల్యే ఎస్వీనాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,729 మంది స్వామివారిని దర్శించుకోగా 20,957 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జీవితం దుర్భరం

కూటమి ప్రభుత్వం చిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోంది. కక్షసాధింపుల్లో భాగంగా కొందర్ని ఇప్పటికే తొలగించగా.. ఉన్న వాళ్లకు జీతభత్యాలు ఇవ్వకుండా వేధిస్తోంది. ఇందులో భాగంగానే పేద రోగులకు అత్యవసర వైద్యసేవలందిచే 104, 108 సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీపావళి పండుగకైనా వేతనాలివ్వండి మహాప్రభో..! అంటూ దిక్కులు పిక్కటిల్లేలా గగ్గోలు పెడుతున్నా దున్నపోతుమీద వానకురిసినట్టు కూటమి ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.



రెండు నెలలుగా అందని వేతనాలు

- అవస్థల్లో 108, 104 ఉద్యోగులు
- మీనమేషాలు లెక్కిస్తున్న కూటమి ప్రభుత్వం
- దీపావళి పండుగకూ పస్తులేనా?

కాణిపాకం(చిత్తూరు రూరల్): రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా పక్కన పెట్టేసింది. విద్యార్థులకు ఫీజు బకాయిలు విడుదల చేయకుండా వేధిస్తోంది. ఇప్పుడు చిరుద్యోగులకు ఇవ్వాల్సిన వేతనాలనూ మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోంది. అత్యవసర వైద్య సేవలందించే ఆపద్బాంధవులకూ జీతాలివ్వకుండా అవస్థల్లోకి నెట్టేసింది. దీనిపై ఉద్యోగ సంఘాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

పల్లె నాడికి గుండె లాంటిది 104

104 వాహనాల్లో అన్ని రకాల పరీక్షలు చేసేందుకు పరికరాలు ఉన్నాయి. ఈసీజీతో సహా 9 రకాల పరీక్షలు చేస్తారు. మధుమేహం, రక్తపోటు, గుండె, కడుపు, కంటికి సంబంధించిన పరీక్షలు చేస్తుంటారు. అక్కడికక్కడే బాధితులకు 74 రకాల మందులను ఉచితంగా అందిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో మధుమేహం, రక్తపోటు లాంటి దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్న వారి సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో.. ప్రతిరోజూ ఈ వాహనాల వద్ద వైద్యులు నిర్వహించే ఓపీకి రోగులు క్యూ కడుతుంటారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారు బీపీ, మధుమేహం లాంటి పరీక్షలను ఎప్పటికప్పుడు ఆస్పత్రులకు వెళ్లి చేయించుకునే పరిస్థితి ఉండదు. ఈనేపథ్యంలో ప్రతి పంచాయతీకి నెలలో రెండు సార్లు వెళ్లి వైద్యశిబిరాలు నిర్వహిస్తుంటారు. అక్కడే పరీక్షలు చేసి మందులు, మాత్రలు పంపిణీ చేస్తుంటారు.

తిరుపతి జిల్లా సమాచారం

104 సమాచారం

వాహనాల సంఖ్య	డ్రైవర్లు	డీఈఓలు	మేనేజర్
39	43	43	1

108 సమాచారం

వాహనాల సంఖ్య	ఈఎంటీలు	పైలెట్లు	సూపర్‌వైజర్లు	మేనేజర్లు
41	103	103	3	1

ప్రతి నెలా 108 ద్వారా అందుతున్న సేవలు	అత్యవసర సమయాల్లో	104 ద్వారా అందుతున్న సేవలు
55 వేల మందికి	5 వేల మందికి	50 వేల మందికి

రెండు నెలలుగా అవస్థలు

ప్రస్తుతం 104 వాహనాలకు అవసరమైన ఇంధనం, మందులను మాత్రం నిర్వహణ సంస్థ అరబిందో ఫౌండేషన్ అందజేస్తోంది. జీతాల గురించి అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడం వల్లే ఇవ్వలేకపోతున్నామని చెబుతున్నారంటూ సిబ్బంది వాపోతున్నారు. వాహనాల్లో పనిచేసే డ్రైవర్లకు సీనియారిటీ ఆధారంగా రూ.14వేల నుంచి రూ.25వేలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.15 వేల లోపే జీతాలు ఇస్తున్నారు. మేనేజర్లకు రూ.50 వేల వరకు జీతాలు అందుతున్నాయి. 108లో పనిచేసే ఈఎంటీ, పైలెట్‌లకు రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు వస్తోంది. సూపర్‌వైజర్లకు రూ.30వేలు, మేనేజర్‌కు రూ.50 వేల చొప్పున్న చెల్లించాల్సి ఉంది. అయితే రెండు నెలలు(ఆగస్టు, సెప్టెంబర్)గా జీతాలందకపోవడంతో వీరు నానా అవస్థలు పడుతున్నారు. కుటుంబ అవసరాలకు అప్పులు చేసి ముప్పుతిప్పలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో 104,108 సిబ్బంది రోడెక్కెందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది.

ఆయుష్షు పోసే బ్రహ్మ 108

అత్యవసర సేవలకు 108 వాహన సేవలు ఆయుష్ పోస్తోంది. జిల్లా వ్యాప్తంగా 108 వాహనాలు కుయ్ కుయ్ మంటూ పరుగులు పెడుతున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా అత్యవసర ఆరోగ్య సేవలందిస్తున్నాయి. వీటిల్లో పనిచేసే సిబ్బంది జీతభత్యాల విషయంలో ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం శోచనీయమని పలువురు విమర్శిస్తున్నారు. వెంటనే వారికి వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రెండు రోజుల్లో..

“ జీతాల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రెండు రోజుల్లో జీతాలు బ్యాంకు ఖాతాకు జమవుతాయి. నిధులు వచ్చాయి. ట్రెజరీ నుంచి రావాల్సి ఉంది. పెండింగ్ జీతాల విషయంలో అనుమానాలు వద్దు.

–శ్రీహరి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, తిరుపతి

భూమనకు పెద్దిరెడ్డి అభినందనలు



భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులుగా భూమన కరుణాకర రెడ్డి నియమితులైన సందర్భంగా మంగళవారం పద్మావతీపురంలోని భూమన నివాసానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వయంగా విచ్చేశారు. ఈ సందర్భంగా భూమన కరుణాకరరెడ్డికి దుశ్శాలువ కప్పి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఇద్దరూ కొంతసేపు ముచ్చటించారు.

‘పది’ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజును ఈ నెల 28వ తేదీ నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ‘డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్’ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలని డీఈఓ కేవీఎన్.ప్రసాద్ తెలిపారు. అలాగే ఒకేషనల్, మైగ్రేషన్ సర్టిఫికెట్లకు సైతం ఫీజును ఆ వెబ్‌సైట్‌లోనే చెల్లించాలని సూచించారు. పది పబ్లిక్ పరీక్ష రాసేందుకు వయసు తక్కువ ఉన్న విద్యార్థులు అండర్ ఏజ్ సర్టిఫికెట్ చలనాలను సీఎఫ్ఎంఎస్ ద్వారా ఒక్కొకరికీ రూ.300 చెల్లించి డీఈఓ వద్ద సర్టిఫికెట్ పొందాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లోనూ, అలాగే డీఈఓ కార్యాలయంలోనూ సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

పేరుకే సమీక్ష.. ప్రత్యర్థుల పైనే విమర్శలు!



ఉన్న సీట్లలో అధికారులు, నేతలు కూర్చోవడంతో నిలబడే మంత్రి అనగాని సత్యప్రసాద్
ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న మీడియా మిత్రులు

- రాజకీయ రంగుపులుముకున్న అధికారుల సమీక్ష సమావేశం
- ఎంపీ, ఎమ్మెల్యేలు కాకుండా.. పలువురు పార్టీ నాయకుల హాజరు
- కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారుల మధ్యనే రాజకీయ విమర్శలు
- ఉదయం 11కు రివ్యూ మీటింగ్ అని చెప్పి మధ్యాహ్నం 1 గంటకు హాజరు
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సమావేశంపై అధికారులు, మీడియా ప్రతినిధుల అసంతృప్తి

సాక్షి టాస్క్‌ఫోర్స్: పేరుకు అధికారులతో సమీక్ష సమావేశం.. కానీ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యర్థులపై రాజకీయ విమర్శలకే ప్రాధాన్యతనివ్వడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. మంగళవారం ఉదయం 11 సమీక్ష సమావేశమని చెప్పి ఏకంగా మధ్యాహ్నం ఒంటిగంటకు హాజరవడంతో ఇటు జిల్లా అధికారయంత్రాంగం.. అటు మీడియా ప్రతినిధిలు తీవ్ర అసహనానికి గురయ్యారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా మొదటిసారి తిరుపతికి విచ్చేశారు. మొదటి రోజు సోమవారం కూటమి అంతర్గత సమావేశంలో పాల్గొన్నారు. రెండో రోజు మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ మంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ, జనసేన నాయకులు దర్జాగా అధికారుల మధ్యలో కూర్చుని కాలక్షేపం చేశారు. దీంతో సమీక్ష సమావేశం కాస్త రాజకీయ సమావేశంలా మారిపోయింది. ఇదిలా ఉంటే.. అనుకున్న సమయం 11 గంటలకు అని చెబితే.. మంత్రి మధ్యాహ్నం 1 గంటలకు హాజరయ్యారు. దీంతో అప్పటికే అధికారులు తీవ్ర నిరుత్సాహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు ప్రారంభమైన సమీక్ష సమావేశం సాయంత్రం 3.30 గంటల వరకు సాగింది. అదేవిధంగా మధ్యాహ్నం ఒంటి గంటలకు ప్రెస్ మీట్ అని ఐఎస్‌పీఆర్ అధికారులు సమాచారం ఇచ్చారు. ఆ సమయానికంటే ముందే చేరుకున్న మీడియా మిత్రులు సాయంత్రం 3.30 గంటల వరకు వేచి చూసి సహనం నసించి నేరుగా అధికారుల సమీక్ష సమావేశం మందిరంలోకి చేరుకున్నారు. మధ్యాహ్నం ప్రెస్ మీట్ అని చెప్పి సాయంత్రం అవుతోందని చెప్పారు. దీంతో ఇన్‌చార్జ్ మంత్రి అధికారుల సమక్షంలోనే విలేకరుల సమావేశం నిర్వహించారు. అయితే ఈ విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, పార్టీని విమర్శించడానికే ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో ప్రెస్ మీట్, సమీక్ష సమావేశం రాజకీయ కార్యక్రమంలా మారిపోయింది. ఇన్‌చార్జ్ మంత్రి రాజకీయ విమర్శలు చేస్తుంటే.. కలెక్టర్, ఎస్పీ, మరికొందరు ఉన్నతాధికారులు తీవ్ర ఇబ్బందికి గురవ్వడం గమనార్హం.

స్థానిక సమస్యల ప్రస్తావనేది?

అధికారుల సమీక్ష సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లోని సమస్యలను ఎక్కడా ప్రస్తావించలేదు. గత ప్రభుత్వంలో అక్కడ అవినీతి జరిగింది.. ఇక్కడ అవినీతి జరిగింది దానిపై విచారణ చేపట్టండి అంటూ కాలయాపన చేశారు. అంతేకాకుండా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే స్థానిక ఆర్డీవోతోపాటు ఫారెస్ట్ అధికారులు యాక్టివ్‌గా పనిచేయాలంటూ ఆదేశాలివ్వడంతో పలువులు అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఐటీఐ.. ఉపాధికి సై

పేద, మధ్య తరగతి విద్యార్థుల కలను ఐటీఐ కళాశాల (పారిశ్రామిక శిక్షణా సంస్థ– ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) సాకారం చేస్తోంది. అందుబాటులో ఉన్న కోర్సులను అందిపుచ్చుకుని తక్కువ సమయం, తక్కువ వ్యయంతో జీవితంలో స్థిరపడేందుకు దోహదపడుతోంది. పదో తరగతి విద్యార్హతతో ఏడాది, రెండేళ్ల కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తూ.. పరిశ్రమలకు అనుగుణంగా శిక్షణ అందించి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తోంది. పెద్దపెద్ద చదువులు చదివినప్పటికీ సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా మారుతున్న తరుణంలో.. ఐటీఐ కోర్సు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని తమ జీవితాలను చక్కదిద్దుకోవచ్చని నిపుణులు అభిప్రయపడుతున్నారు.



మోటార్ మెకానిక్ ట్రేడ్‌లో స్కూటర్ రిపేర్‌లో శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్



ఉడ్ వర్క్ టెక్నీషియన్ ట్రేడ్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

- తక్కువ సమయం.. తక్కువ వ్యయంతో కోర్సు పూర్తి
- పుష్కలంగా ఉద్యోగావకాశాలు
- తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అందుబాటులో 16 ట్రేడ్లు
- పరిశ్రమలకు అనుగుణంగా శిక్షణ
- జీవితంలో త్వరగా స్థిరపడేందుకు సువర్ణ అవకాశం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో పదో తరగతి విద్యార్హతతో వివిధ ట్రేడ్లలో అడ్మిషన్లు ముగిశాయి. రెండేళ్లు, ఏడాది కోర్సులు మొత్తం 16 కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నారు. చదువు, ఆర్థికంగా కాస్త వెనుకబడ్డ విద్యార్థులు జీవితంలో త్వరగా స్థిరపడేందుకు ఐటీఐ కోర్సులు ఉత్తమమైన ఎంపిక అని మేధావులు చెబుతున్నారు. ఐటీఐ ట్రేడు పూర్తిచేసిన వారికి పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి.

పది విద్యార్హతతో ప్రవేశం

పదో తరగతి విద్యార్హతతో ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా ఐటీఐ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 16 ట్రేడ్లలో ప్రవేశం కల్పిస్తున్నారు. రెండేళ్లు, ఏడాది కాలవ్యవధితో కూడిన కోర్సులను అభ్యసించవచ్చు.

ఉన్నత చదువులకు అవకాశాలు

ఐటీఐ అర్హత సాధించిన విద్యార్థులకు ఉత్తమ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయి. అలాగే పై చదువు అభ్యసించేందుకు అవకాశం ఉంది. రెండేళ్ల ఐటీఐ చేసిన వారు బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశ పరీక్షతో పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు. అలాగే డిప్లొమో పూర్తయ్యాక ప్రవేశ పరీక్ష ద్వారా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు. బీటెక్ చేసిన వారితో పోలిస్తే ఐటీఐ, డిప్లొమో ద్వారా బీటెక్ చేసిన వారికే చాలా కంపెనీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి.

తిరుపతి ఐటీఐ తలమానికం

ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరం క్రమేపి విద్యానగరంగాను, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో పరిశ్రమలకు అనుగుణంగా విద్యనందించేందుకు ఐటీఐ కళాశాలను 1983లో తిరుపతి ఖాదీ కాలనీలో ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి రేణిగుంట ఇండస్ట్రియల్ ఏరియా, తిరిగి శివజ్యోతినగర్, అక్కడి నుంచి పద్మావతీపురానికి ఐటీఐ కళాశాలను తరలించారు. అప్పటి వరకు అద్దె భవనంలో నడిచిన ఐటీఐ కళాశాలకు పద్మావతీపురంలో దాదాపు 11 ఎకరాలను కేటాయించారు. 2005లో సొంత భవనంలో ఐటీఐ కళాశాల తరగతులు ప్రారంభమయ్యాయి. ఒక్కో ట్రేడుకు ఒక్కో భవనం, అందులో శిక్షణకు అవసరమైన అన్ని సామగ్రిలతో శిక్షణ అందిస్తున్నారు. ఇక్కడ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, పెయింటింగ్, మోటార్ మెకానిక్ వంటి 6 ట్రేడ్లల్లో రెండేళ్ల కోర్సు, ఉడ్ వర్క్ డిజైనింగ్, కోప(కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్), డీజిల్ మెకానిక్, వెల్డర్ వంటి 4 ట్రేడ్లలో ఏడాది పాటు శిక్షణ ఇస్తున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా వివరాలు

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు	ప్రైవేటు ఐటీఐ కళాశాలలు	ట్రేడ్లు
10	34	16

కోర్సు (ట్రేడ్లు) వివరాలు

రెండేళ్ల కోర్సు	ఏడాది కోర్సు
ఎలక్ట్రీషియన్	కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగామ్ అసిస్టెంట్)
ఫిట్టర్	డీజిల్ మెకానిక్
టర్నర్	డ్రెస్ మేకింగ్
మిషనిస్ట్	వెల్డర్
పెయింటర్	వుడ్ వర్క్ టెక్నీషియన్
మోటార్ మెకానిక్	ప్లాస్టిక్ ప్రాసెస్ ఆపరేటర్
డిమాన్ సివిల్	హెల్త్ అండ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్
ఎలక్ట్రానిక్ మెకానిక్	
వైర్‌మన్	

ఐటీఐతో పుష్కలమైన ఉద్యోగావకాశాలు



“ ఐటీఐ కోర్సు చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో పుష్కలమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయి. తమ విద్యార్థులకు శిక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు వివిధ సంస్థలతో క్యాంపస్ సెలెక్షన్స్, జాబ్ మేళా వంటివి నిర్వహిస్తున్నాము. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో జీవితంలో త్వరగా స్థిరపడేందుకు ఐటీఐ ఉత్తమమైన మార్గం. పదో తరగతి విద్యార్హతతో ఐటీఐలో ప్రవేశం పొందవచ్చు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – **వీ.లక్ష్మి, కన్వీనర్/ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, తిరుపతి (పద్మావతీపురం)**

ఆర్టీసీలో ఉద్యోగం



తిరుపతి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏడాది కోర్సు అయిన డీజిల్ మెకానిక్‌ను 2007లో పూర్తిచేశాను. ఆ తరువాత 2011లో ఆర్టీసీలో ఉద్యోగం సాధించాను. తెలియని వాళ్లు ఐటీఐ కోర్సును తక్కువగా చూస్తుంటారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు జీవితంలో త్వరగా స్థిరపడేందుకు ఐటీఐ దోహద పడుతుంది. – **ఏ.ప్రసాద్, డీజిల్ మెకానిక్**

ప్రయివేటు కంపెనీలో చేరా



రెండేళ్ల కోర్సు అయినటువంటి మోటార్ మెకానిక్‌ను 2022లో పూర్తిచేశాను. అమరరాజ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్‌లో మంచి జీతంతో ఉద్యోగం సాధించాను. ఇప్పుడు నా జీవితం చాలా సంతోషంగా ఉంది. – **వై.అశోక్‌కుమార్, మోటార్ మెకానిక్**

ఫీల్డ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నా



ఐటీఐ చేయాలని నాకు చాలా మంది సలహా ఇచ్చారు. దీంతో కో పా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోర్సు)ను 2021లో పూర్తి చేశాను. 2022లో ఎక్సెల్ బ్రాడ్‌బ్రాండ్ ప్రైవేటు సంస్థలో ఫీల్డ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం సాధించాను. – **పీ.జ్యోతికుమార్, కోపా**

ఈసీఎల్ కంపెనీలో ఉద్యోగం



ఐటీఐలోని రెండేళ్ల కోర్సు అయిన ఫిట్టర్‌ను ఈ ఏడాది పూర్తిచేశాను. కోర్సు అవ్వగానే నేను శ్రీకాళహస్తిలోని ఈసీఎల్ కంపెనీలో ఉద్యోగం సాధించాను. ఐటీఐ చేయడం వలనే నేను మంచి ఉద్యోగం సాధించగలిగాను. తక్కువ సమయంలో స్థిరపడ్డాను. – **ఎం.ఢిల్లీబాబు, ఫిట్టర్**

హర్షా టయోటాలో ఉద్యోగం



నేను 2009–2011లో ఐటీఐలో పెయింటర్ కోర్సును పూర్తి చేశాను. ఆ తరువాత చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటూ 2013లో హర్షా టయోటా సంస్థలో పెయింటర్‌గా ఉద్యోగంలో చేరాను. మంచి జీతంతో జీవితాన్ని చక్కదిద్దుకున్నాను. – **ఎస్‌వీ.రామనాథన్, పెయింటర్**

ఏరోనాటికల్‌లో ఉద్యోగం



నేను 2001–2003లో తిరుపతి ఐటీఐ కళాశాలలో పెయింటర్ కోర్సును పూర్తి చేశాను. 2005 నుంచి 2012వరకు బెంగళూరులో ఓల్వో బస్‌స్ సంస్థలో ఉద్యోగం చేశాను. 2012 నుంచి హిందూస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్ సంస్థలో పనిచేస్తున్నాను. – **వెంకటేష్, పెయింటర్**

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. 1వ పట్టణ సీఐ గోపి కథనం.. బంగారమ్మ ఆలయ సమీపంలో టైలర్స్ కాలనీలో నివాసం ఉండే విజయకుమార్(55) సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 9440796792 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

రెండు బైక్‌లు ఢీ


ప్రమాదంలో గాయపడిన లీలామోహన్

దొరవారిసత్రం: రెండు బైక్‌లు ఢీకున్న ఘటనలో అసిస్టెంట్ పోస్ట్‌మన్ దాసరి లీలామోహన్(22) గాయపడ్డాడు. ఈ ఘటన నెలబల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై రెస్ట్ ఏరియా వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. వాకాడు మండలం, విద్యానగర్ ప్రాంతానికి చెందిన లీలామోహన్ దొరవారిసత్రం పోస్ట్ ఆఫీస్‌లో అసిస్టెంట్ పోస్ట్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో డీవీ సత్రంలో విధులు ముగించుకుని తిరిగి వెళ్తున్న సమయంలో నెలబల్లి వద్ద ఉన్న రెస్ట్ ఏరియా వద్ద ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకుని తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం నాయుడుపేట తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలే.

వైభవంగా పవిత్రాల సమర్పణ


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో రెండో రోజైన మంగళవారం పవిత్రోత్సవాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పవిత్ర సమర్పణ చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనాన్ని వేడుకగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మూలవర్లకు, ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

సమీరా వచ్చేస్తున్నా!

- అంతలోనే తిరిగిరాని లోకాలకు
- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- తల్లడిల్లిన భార్య


కొప్పల నారాయణ (ఫైల్)


ఘటనా స్థలంలో కొప్పలనారాయణ మృతదేహం

శ్రీకాళహస్తి: 'సమీరా వచ్చేస్తున్నా... మరో 15 నిమిషాల్లో నీ ముందుంటా.. నువ్వేం కంగారుపడకు.. బాబు తిన్నాడా..! నువ్వు భోజనం చేసి పడుకో.. ఐ యామ్ ఆన్‌ది వే..' అన్న భర్త తెల్లారేసరికి విగత జీవిగా కనిపించడం ఆమె గుండెల్ని పిండేసింది. ఈ ఘటన స్థానికంగా పెను విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం..

బుచ్చినాయుడుకండ్రిగ మండలం, జోగికండ్రిగకు చెందిన కొప్పల ధర్మయ్య కుమారుడు కొప్పల నారాయణ(25) డిగ్రీ వరకు చదివి రౌతుసూరమాల సమీపంలో ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. నారాయణకు పెళ్లకూరు మండలం, నెలబల్లి దళితవాడకు చెందిన సమీరాతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో భార్య సమీరా కొడుకుతో కలిసి పుట్టింటికి వెళ్లింది. ఆమెను చూసేందుకు నారాయణ రెండు రోజుల కిందట నెలబల్లి వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తికి వెళ్లాడు. తిరిగి వస్తూ తన మేనత్త ఊరైన తాటిపర్తికి చేరుకున్నాడు. రాత్రి పది అవుతున్నా నారాయణ ఇంటికి రాకపోవడంతో సమీరా భర్తకు ఫోన్ చేసింది. తాను తాటిపర్తిలో ఉన్నానని, మరో 15 నిమిషాల్లో నీ ముందుంటానని సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో నెలబల్లికి మార్గమధ్యంలో నాయుడుపేట-మదనపల్లి జాతీయ రహదారికి అతి సమీపంలో రామానాయుడు ఎస్టీ కాలనీ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బండరాయిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. బండరాయిని ఢీకొన్న సమయంలో నారాయణ బైక్‌తో పాటు ముళ్లపొదల్లో పడిపోవడంతో ఎవ్వరూ గుర్తించలేకపోయారు. ఇప్పుడే వస్తానన్న భర్త తెల్లారైనా ఇంటికి రాకపోవడంతో సమీరా తాటిపర్తిలోని తమ బంధువులకు సమాచారం అందించింది. దీంతో వారు ఆరా తీయగా ముళ్లపొదల్లో విగతజీవిగా పడి ఉండడాన్ని చూసి బోరుమన్నారు. తొట్టంబేడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

భరద్వాజ తీర్థంలో అశ్లీల నృత్యాలు


భరద్వాజ తీర్థంలో యూట్యూబర్ల నృత్యాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలో కొంతమంది యూట్యూబర్లు అశ్లీల నృత్యాలు చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. భరద్వాజ తీర్థం భరద్వాజ మహర్షి తపస్సు చేసిన స్థలంగా ఖ్యాతి పొందింది. భక్తపరాయణుడైన శివయ్య సంవత్సరంలో ఒకరోజు తై అమావాస్యకు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సతీసమేతంగా భరద్వాజ తీర్థానికి వచ్చి అభిషేక పూజలు అందుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రశాంతమైన ఈ స్థలంలో తరచూ అసాంఘిక కార్యక్రమాలు పెచ్చుమీరుతున్నారు. కొంతమంది యువకులు చెట్లకింద కూర్చుని మద్యం సేవిస్తున్నారు. దీనికితోడు ఇటీవల యూ ట్యూబర్లు అశ్లీల నృత్యాలను ఇక్కడ చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్టు చేయడం విమర్శలకు తావిస్తోంది. సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు సరిగా విధులు నిర్వర్తించకపోవడం వల్లే ఇలాంటి తప్పిదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువగా పెరిగాయని మండిపడుతున్నారు. మూడు నెలలుగా సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడంతో వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు దీనిపై దృష్టిసారిస్తారో.. లేక ఆ శివుడికే వదిలేస్తారో వేచి చూడాల్సి ఉంది.

పంచెకట్టు..దోచిపెట్టు!

- రాహు-కేతు పూజలకు పంచెలు ధరించాలని నిర్ణయం
- ముందుగా ప్రచారం లేకుండా 15 రోజుల క్రితం నిర్ణయం
- శ్రీకాళహస్తి ఆలయ ప్రాంగణంలో వ్యాపారుల దోపిడీ


శ్రీకాళహస్తి ఆలయంలో సంప్రదాయ దుస్తులతో రావాలని సూచిస్తున్న బోర్డు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారుల నిర్ణయాలు వ్యాపారులకు వరంగా మారాయి. సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా అనుకున్నదే తడవుగా నిర్ణయాలు అమలు చేస్తుండడంతో భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. రాహు-కేతు పూజల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తుల్లో రావాలని ఆలయ అధికారులు 15 రోజుల క్రితం నిబంధనలు పెట్టారు. ఈ సంప్రదాయం మంచిదే అయినప్పటికీ ముందుగా ప్రచారం చేసి ఉంటే భక్తులందరికీ తెలిసేది. ఉన్నపళంగా సంప్రదాయ దుస్తుల నిబంధన పెట్టడం శ్రీకాళహస్తి పట్టణంలోని కొందరు వ్యాపారులకు వరంగా మారింది. తెల్లవారు జామున బస్సులు, రైళ్లల్లో, వివిధ వాహనాల్లో ఆలయానికి వచ్చే భక్తులను కొందరు వ్యాపారులు రోడ్లపై అడ్డగించి నిలువు దోపిడీ చేస్తున్నారు. రాహు-కేతు పూజలు చేయించుకోవాలంటే తప్పనిసరిగా పురుషులు పంచెలు ధరించాలని భయపెడుతున్నారు. కొందరు మహిళలు కూడా వ్యాపారం చేస్తుండడంతో పురుష భక్తులు ఇబ్బంది పడుతున్నారు. రూ.200 విలువ చేసే పంచెను రూ.500కు అంటగడుతున్నారు. నిబంధనలు తెలియక భక్తులు వ్యాపారుల చేతుల్లో మోసపోతున్నారు. పట్టణంలోని తేరువీధిలో ఉన్న కొందరు వ్యాపారులు, భిక్షాల గాలిగోపురం, శివయ్య గోపురం ద్వారా వచ్చే భక్తులు దోపిడీకి గురవుతున్నారు. స్వామి, అమ్మవార్ల అర్ధ మండపం దర్శనం, అభిషేకాలకు మాత్రం సంప్రదాయ వస్త్రధారణ నిబంధన ఉంది. దీనిని సక్రమంగా అమలు చేయలేని అధికారులు రాహు-కేతు మండపాల్లో సంప్రదాయ వస్త్ర నిబంధన అమలుచేస్తున్నారు. దీంతో భక్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇదిలాగే కొనసాగితే ఆలయ ఆదాయానికి గండిపడే ప్రమాదముంది. పత్రికల్లో, టీవీల్లో వార్తలు వస్తున్నా స్థానిక కూటమి నాయకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పైగా ఆలయ అధికారుల నిర్ణయాలను సమర్థిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

7న మిక్స్‌డ్ రైస్ వేలం

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన బియ్యంను నవంబరు 7వ తేదీన టెండర్ వేలం వేయనున్నారు. ఇందులో మిక్స్‌డ్ బియ్యం 13,880 కిలోలు టెండర్, వేలంలో ఉంచనున్నారు. ఆసక్తి గలవారు నవంబరు 7వ తేదీలోపు కార్యనిర్వహణాధికారి, టీటీడీ పేరిట రూ.25,000 ఈఎండీ, సీల్డ్ టెండర్‌తోపాటు తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం, జనరల్ మేనేజర్(వేలం) కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు టెండర్లను తీస్తారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం, 0877-2264429 నంబరులో కార్యాలయం వేళల్లోనూ.. టీటీడీ వెబ్‌సైట్ www.tirumala.org... లోసంప్రదించాలని టీటీడీ అధికారులు తెలిపారు.

ఎర్రచందనం పరిరక్షణకు కృషి


టాస్క్‌ఫోర్స్ పోలీసులతో ఎస్పీ శ్రీనివాస్, అటవీశాఖ అధికారులు

తిరుపతి మంగళం: శేషాచలం అడవుల్లోని ఎంతో విలువైన ఎర్రచందనం పరిరక్షణకు అందరూ బాధ్యతగా పనిచేయాలని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ సూచించారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి ఉద్యోగులతోపాటు, టాస్క్‌ఫోర్స్ సబ్ కంట్రోల్ కార్యాలయాలు కడప, సానిపాయ, రైల్వే కోడూరు సిబ్బంది జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం లేకుండా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఉద్యోగులు పొరబాట్లకు తావు లేకుండా, ఏ విధంగా విధులు నిర్వహించాలనే అంశంపై దిశానిర్దేశం చేశారు. అరుదైన ఎర్రచందనాన్ని శేషాచలం అడవుల్లో సంరక్షించడం ఉద్యోగుల బాధ్యతగా పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు తమ సమస్యలను తెలియజేయగా, అప్పటికప్పుడే కొన్నింటిని పరిష్కరించారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐ సురేష్ కుమార్, ఎఫ్ఆర్ఓలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలని నిరసన


తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చంద్రగిరి: గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు రూ.3,480 కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసనకు దిగారు. జిల్లా ఉపాధ్యక్షులు తేజ మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.3,480 కోట్లను కూటమి ప్రభుత్వం రాగానే విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలవుతున్న నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. చంద్రగిరిలో ఎస్సీ హాస్టల్‌కు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన చంద్రగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం శోచనీయమన్నారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, మెస్ చార్జీలు రూ.3వేలకు పెంచాలని కోరారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, జీఓ నం.77ను రద్దు చేసి, పీజీ చదివే విద్యార్థులందరికీ ఫీజు రియింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలుపై నవంబర్ 6న జిల్లా కలెక్టర్ ఎదుట నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, జిల్లా నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

5 నుంచి 'ఉల్లాస్'


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు

తిరుపతి అర్బన్: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమం నవంబర్ 5 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు తెలిపారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 2వ తేదీ వరకు డీఆర్‌డీఏ పరిధిలోని సంఘమిత్రలకు శిక్షణ ఇచ్చామనిని, వారు నవంబర్ 5 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు రోజుకు రెండు గంటల చొప్పున 200 గంటలు బోధించాల్సి ఉందని చెప్పారు. అవసరమైన మేరకు పుస్తకాలు ఇస్తామన్నారు. అయితే సంఘమిత్రలు ఉచితంగా మాత్రమే బోధించాలని స్పష్టం చేశారు. వయోజన విద్య నోడల్ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని సభ్యులు 12,085 మందికి సంతకాలు చేయడం కూడా తెలియదన్నారు. వారందరికీ సరైన బోధన చేయాల్సి ఉందన్నారు. ఏపీఓ ప్రభాకర్‌రెడ్డి, ఏపీఎం ఉమాదేవి, వయోజన విద్య పర్యవేక్షకులు సుజాత, శైలజ, థామస్ అబ్రహం పాల్గొన్నారు.

తెలుగు సాహితీ క్రీడ.. అవధానం

- కల్లివెట్టులో శతావధాని ఆముదాల మురళి అవధానం
- పిల్లల్లో భాషా సామర్థ్యాలను వెలికి తీయాలి


అవధానం చేస్తున్న శతావధాని ఆముదాల మురళి

బుచ్చినాయుడుకండ్రిగ: పిల్లల్లోని భాషా సామర్థ్యాలను వెలికితీసి సృజనాత్మకంగా ఆలోచించేలా చేయడంతోపాటు వ్యక్తిత్వ వికాసానికి కృషి చేయాలని బాల సాహితీ వేత్త కృష్ణస్వామిరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు యువశ్రీ మురళి ఆధ్వర్యంలో శతావధాని ఆముదాల మురళి అష్టావధానం నిర్వహించారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన అవధానంలో పృచ్ఛకులు నిషిద్ధాక్షరి-గండుపల్లి గోవిందయ్య, సమస్య-చిన్న యర్రయ్య, దత్తపది-యువశ్రీ మురళి, వర్ణన-పేరూరు బాలసుబ్రమణ్యం, పురాణ పఠనం-డాక్టర్ యడవల్లి పరమేశ్వరయ్య, న్యస్తాక్షరి-డాక్టరు నెమిలేటి కిట్టన్న, ఆసువు-ఏడుకొండలయ్య, అప్రస్తుత ప్రసంగం-డాక్టర్ రంగయ్య అడిగిన ప్రశ్నలకు అవధాని పద్యాలతో సమాధానాలు పూరించారు. రాబోయే దీపావళికి అవధానం అంకితం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నేటి పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా కథల పుస్తకాలు చదివించాలని తెలిపారు. అనంతరం ఆముదాల మురళి, పృచ్ఛకులను జై తెలుగు తల్లి జ్ఞాపిక, శాలువాలు, పుస్తకాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, ఉపాధ్యాయులు సురేష్ బాబు, నాదెండ్ల మురళి, ప్రసాద్, వేణుగోపాల్, దాసు, దేవేంద్ర, లక్ష్మయ్య, జగన్నాథం, మాధవీలత, మురళీప్రసాద్, దీపిక, పలు పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు రవీంద్ర రెడ్డి, పురుషోత్తం, నాగరాజు, శివారెడ్డి, మేఘనాథ్, మున్నెమ్మ, హరిబాబు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గజదొంగల అరెస్ట్

- రూ.3.6 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

తిరుపతి క్రైమ్: నగరంలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు గజదొంగలను క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు క్రైమ్ డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. తిరుపతి రూరల్ చెందిన వేములపల్లి శివకుమార్, కృష్ణా జిల్లాకు చెందిన వేములపల్లి దుర్గ భార్యాభర్తలని, వీరిరువురూ తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడేవారన్నారు. వీరిని అలిపిరి బస్టాండ్ వద్ద తమ సిబ్బంది అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3.6 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరు గతంలో 30కి పైగా దొంగతనాలు చేసి, జైలు శిక్ష కూడా అనుభవించారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

-జిల్లాలో మొత్తం ఓటర్లు 18,11,685

తిరుపతి అర్బన్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా 2025 షెడ్యూల్ ప్రకారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 28వ తేదీ వరకు గడువు ఉందని స్పష్టం చేశారు. తుది ఓటర్ల జాబితాను వచ్చే ఏడాది జనవరి 6వ తేదీన ప్రచురిస్తామని ఆయన స్పష్టం చేశారు. 2025 జనవరి 1కి 18 ఏళ్లు నిండిన వారు కొత్త ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా వచ్చే అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండనున్న వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 18,11,685 ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. అందులో పురుషులు 8,82,129, స్త్రీలు 9,28,543 మంది ఉన్నట్లు ప్రకటించారు. ఇతరులు 174 మంది, సర్వీస్ ఓటర్లు 839 మంది ఉన్నారన్నారు.

యువతరంగ్-24 వాల్‌పోస్టర్ విడుదల

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా గోడపత్రికను మంగళవారం ఆవిష్కరించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నవంబర్ 8,9,10 తేదీల్లో యువతరంగ్-24 పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన మంత్రితోపాటు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కల్చరల్ కో-ఆర్డినేటర్ వివేక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, పరిశోధకులు నాదముని, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్ గోడ పత్రిక ఆవిష్కరణలో పాల్గొన్నారు.

2 నుంచి 'కార్తీక' పూజలు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక మాసం సందర్భంగా విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు 2న శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టనున్నారు. 4 వరు గణపతిస్వామి వారి హోమం, 5 నుంచి 7 వరకు శ్రీసుబ్రమణ్యస్వామివారి హోమం, 8న శ్రీదక్షిణామూర్తి స్వామి వారి హోమం, 9న శ్రీనవగ్రహ హోమం జరిపించనున్నారు. అలాగే 10 నుంచి 18 వరకు శ్రీకామాక్షి అమ్మవారి చండీహోమం, 19 నుంచి 29 వరకు శ్రీకపిలేశ్వరస్వామి రుద్రహోమం, 30న శ్రీకాలభైరవ స్వామి హోమం, డిసెంబర్ 1న శ్రీచండికేశ్వరస్వామి వారి హోమం నిర్వహించనున్నారు. చివరి రోజు త్రిశూలస్నానం, పంచమూర్తుల తిరువీధి ఉత్సవం చేపట్టనున్నారు.

విద్యాభివృద్ధే లక్ష్యం


డీఈఓను కలిసి అభినందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లాలో విద్యాభివృద్ధికి, అలాగే ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీఈఓ కేవీఎన్.ప్రసాద్ తెలిపారు. ఇటీవల డీఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను మంగళవారం పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు కలిసి అభినందించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను డీఈఓకు వివరించారు. అలాగే ఉపాధ్యాయులకు భారంగా పరిణమిస్తున్న వివిధ యాప్‌ల నిర్వహణపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. దీనికి డీఈఓ సానుకూలంగా స్పందించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీ.శ్రీనివాస్‌యాదవ్, టీ.సదాశివన్, పాకాల ఎంఈఓ లింగయ్య, రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, వెంకటేష్, రమేష్‌యాదవ్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.రమేష్, ఎస్.సురేష్, నాయకులు నరేంద్ర, జితేంద్రబాబు, దేవానంద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న గేట్ కళాశాల చైర్‌పర్సన్ పీ.విజయ

తిరుపతి సిటీ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి గేట్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గేట్ కళాశాలల చైర్మన్ పీ.విజయ మాట్లాడుతూ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలకు ఎనిమిది బహుళ జాతి కంపెనీలు పాల్గొన్నాయన్నారు. సుమారు 122 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు తెలిపారు. జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ రమేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, అధ్యాపకులు అభినందించారు.